క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఏఎన్‌ఎం అమ్మాజీ

కాకినాడ రూరల్: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏఎన్‌ఎం సీహెచ్ అమ్మాజీ కోరారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో మంగళవారం ఆమె మాట్లాడారు. వర్షాలు పడుతున్నందున వైరస్ జ్వరాలతో పాటు, డెంగీ, మలేరియా వంటి జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నాయన్నారు. తీవ్ర జ్వరం, తలనొప్పి ఉంటే డెంగీగా భావించాలన్నారు. దోమ కుట్టిన పది రోజులకు లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఉండేందుకు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వరలక్ష్మి, అడబాల రత్నప్రసాద్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో చేరువ కావాలి



కరపలో నర్సింగ్ విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న అధికారులు, నాయకులు

కరప: ఉద్యోగం ఏదైనా సామాజిక సేవ చేస్తూ ప్రజలకు చేరువ కావాలని ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం కాకినాడ ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినుల ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.మునిరత్నమ్మ మాట్లాడుతూ చదువుతో పాటు, సమాజంపై బాధ్యత, సేవా గుణం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం కేన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ నర్సింగ్ విద్యార్థినులు, అధికారులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మాజీ ఎంపీటీసీ పెంకే సత్తిబాబు, పీహెచ్‌సీ డైరెక్టర్ యాంజలిన్, ఏఎస్సై వి.సూరిబాబు, డీటీ కె.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే రక్త హీనత నివారణ



పోలేకుర్రులో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

తాళ్లరేవు: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడం ద్వారానే రక్తహీనతను నివారించవచ్చని సీడీపీఓ వి.మాధవి తెలిపారు. మంగళవారం పోలేకుర్రులో జరిగిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రదర్శించి, పౌష్టికాహారం ప్రాముఖ్యతను గర్భిణులు, బాలింతలకు తెలియజేశారు. కార్యక్రమంలో పోలేకుర్రు, పి.మల్లవరం గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వ్రత పురోహితులకు సత్కారం



వ్రత పురోహితులను సత్కరిస్తున్న సభ్యులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం వ్రత విభాగంలో పని చేసి పదవీ విరమణ పొందిన ఐదుగురు పురోహితులను వ్రత పురోహిత సంఘం మంగళవారం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన పురోహితులు దేవస్థానానికి అందించిన సేవలు మరువలేవని అన్నారు. వారు చేసిన సర్వీసు అనుసరించి గ్రాట్యుటీని స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు నాగాభట్ల వీరభద్రశర్మకు రూ.4.60 లక్షలు, మొక్కరాల రామకృష్ణకు రూ.4.20 లక్షలు, దేవులపల్లి భాస్కర్‌కు రూ.3.20 లక్షలు, సెకండ్ గ్రేడ్ వ్రతపురోహితులు భాగవతి వెంకటా చలపతికి రూ.రెండు లక్షలు, కనకదండి బాల సుబ్రహ్మణ్యానికి రూ.1.30 లక్షల చెక్కులను ఈఓ అందజేశారు. అలాగే పదవీ విరమణ చేసిన పురోహితుల దంపతులకు రూ.పది వేలు చొప్పున నగదు, నూతన వస్త్రాలతో వ్రతపురోహిత సంఘం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ పురోహితులు ప్రయాగ అంజిబాబు, మంధా రాంబాబు, చామర్తి జగ్గారావు, తొయ్యేటి హరిబాబు, సంఘ మాజీ అధ్యక్షుడు రవిశర్మ, ఏఈఓ పాలంకి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఆమెదే పైచేయి..

- వాహనాల డ్రైవింగ్‌పై మహిళల్లో పెరుగుతున్న ఆసక్తి
- లైసెన్సులు పొందడంతో మహిళలే ముందంజ
- ఏడాది కాలంలో కాకినాడలో 3,800 లైసెన్సుల జారీ



బాలాజీచెరువు: నేటి కాలంలో అన్ని రంగాలలో పురుషులతో పాటు మహిళలు పోటీ పడుతున్నారు. ముఖ్యంగా డ్రైవింగ్ విషయంలో పురుషులతో సమానంగా పోటీ పడి వాహనాలు నడుపుతున్నారు. ఒకప్పుడు ఇంట్లో కారు ఉన్నా, డ్రైవర్ లేదా డ్రైవింగ్ వచ్చిన ఇంటివారు వచ్చే వరకూ వేచిచూడాల్సి వచ్చేది. ఈ సమస్యను అధిగమించేందుకు కొందరు మహిళలు, యువతులు డ్రైవింగ్ నేర్చుకుని ఒకరిపై ఆధారపడకుండా తమ కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లాలన్నా, చదువు పూర్తయ్యక ఉద్యోగానికి వెళ్లడానికి, వివాహం అయ్యాక అవసరాలకు బయటకు వెళ్లాలన్నా డ్రైవింగ్ ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలోనే కారు డ్రైవింగ్ నేర్చుకునే మహిళల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరుగుతోంది.

సగానికి పైగా..

కుటుంబ సభ్యుల వద్ద, డ్రైవింగ్ స్కూళ్లకు వెళ్లి నేర్చుకున్న తరువాత, డ్రైవింగ్ లెసెన్స్‌లు తీసుకుని, కార్లు నడుపుతూ తోటి మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. గతేడాది ఆగస్టు నుంచి ఏడాది కాలంలో కాకినాడ డివిజన్ పరిధిలో బైక్, కార్లకు జారీ చేసిన లైసెన్స్‌లు 6,700 వరకూ ఉన్నాయి. అందులో 3,400 వరకూ మహిళలు లైసెన్స్ పొందడం గమనార్హం. కాకినాడ నగరంలో ప్రధానంగా ఐదు డ్రైవింగ్ స్కూళ్లు ఉన్నాయి. నాగమల్లితోట జంక్షన్, ఏపీఎస్పీ, రాయుడుపాలెం, జగన్నాథపురం, సురేష్‌నగర్ ప్రాంతాల్లో ఇవి ఉన్నాయి.

ఫీజులు	ఎల్ఎల్ఆర్(రూ.)	పర్మినెంట్ డ్రైవింగ్ లైసెన్స్(రూ.)
కారు, బైక్‌కు కలిపి	410	1,260
కారుకి మాత్రమే	260	1,260
ద్విచక్రవాహనం	260	1,260

కీలకంగా మారిన వేళ

మహిళలకు డ్రైవింగ్ కీలకంగా మారుతోంది. కాకినాడ నగరం, పరిసర ప్రాంతాల్లో విద్యా, వ్యాపార సంస్థలు గణనీయంగా పెరిగాయి. బ్యాంకులు, ఆస్పత్రులు, ప్రైవేటు వాణిజ్య సంస్థలు ఇలా ఎన్నో కార్యాలయాలు వెలిశాయి. భానుగుడి జంక్షన్, శ్రీనగర్, లక్ష్మీనారాయణ నగర్, వెంకట్‌నగర్ తదితర ప్రాంతాలు నిత్యం మహిళా ఉద్యోగులు, విద్యార్థినులతో రద్దీగా ఉంటాయి. అందులో మహిళా ఉద్యోగులు పెద్ద పంఖ్యలోనే ఉన్నారు. నిత్యం ఆటోలు, బస్సుల్లో ప్రయాణించడం వల్ల ఖర్చు అధికమై, పర్సులు ఖాళీ అవుతున్నాయి. దీనిని అధిగమించేలా మహిళా ఉద్యోగులు సొంత వాహనాలను సమకూర్చుకుంటున్నారు. ఆదాయం కాస్త భేషుగ్గా ఉంటే, కార్లను సమకూర్చుకుంటున్నారు. ఇందుకు బ్యాంకులు కూడా వాహన రుణాలిస్తూ సహకరిస్తున్నాయి.

డ్రైవింగ్ చాలా అవసరం



బైక్‌తో పాటు, కారు నేర్చుకోవడం వల్ల అత్యవసరమైనప్పుడు సొంతంగా బయటకు వెళ్లడానికి అవకాశం ఉంటుంది. ఏడాది క్రితమే డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాను. నేటి కాలంలో మహిళలకు డ్రైవింగ్ చాలా అవసరం. ముఖ్యంగా డ్రైవింగ్ వచ్చిన తరువాత లైసెన్స్ పొందడం మరీ ముఖ్యం.

– ఎస్.శారద, కాకినాడ

విద్యార్థినులే ఎక్కువ



విద్యార్థినులు, యువతులు ఎక్కువగా లైసెన్స్‌లు తీసుకుంటున్నారు. చదువు పూర్తయ్యక విదేశాల్లో అవసరమనో, లేక ఇంటి అవసరాలకు, ఉద్యోగరీత్యా డ్రైవింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు. మహిళలు డ్రైవింగ్ నేర్చుకుంటే అన్ని విధాలా ఉపయోగపడుతుంది.

– ఎం.కళాజ్యోతి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, కాకినాడ

డ్రైవింగ్ స్కూళ్ల ద్వారా..

వాహనాలను సమకూర్చుకుంటే సరిపోదు. వాటిని చాకచక్యంగా నడిపే సామర్థ్యమూ ఉండాలి. అందుకు డ్రైవింగ్ స్కూళ్లు మహిళలకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ముందుగా డ్రైవింగ్ స్కూళ్లలో వాహనాలను నడపడం పూర్తిగా నేర్చుకున్న తర్వాతే, వాహనాల కొనుగోలుకు మహిళలు మొగ్గుచూపుతున్నారు. డ్రైవింగ్‌లో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి లైసెన్సులు పొందడంలో ఆయా డ్రైవింగ్ స్కూళ్లు సహకారం అందిస్తున్నాయి. కేవలం మహిళా ఉద్యోగులే కాకుండా, విద్యార్థినులు డ్రైవింగ్ నేర్చుకోవడంపై ఆసక్తి చూపుతున్నారు. ఇంటి నుంచి కళాశాలలకు ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

గణేశ్ మంటపాలకు అనుమతి తప్పనిసరి

కాకినాడ రూరల్: వినాయక చవితి మంటపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ కోరారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, వినాయక మంటపాల కోసం సింగిల్ విండోలో దరఖాస్తు చేసుకుని అనుమతి పొందవచ్చన్నారు. మంటపాలు ఏర్పాటు చేసే ప్రాంతాలు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండాలని స్పష్టం చేశారు. విద్యుత్ తీగలు తాకకుండా జాగ్రత్తలు చూసుకోవాలన్నారు. సింగిల్ విండో సిస్టమ్ ద్వారా దరఖాస్తుదారులు మంటపం పెట్టే ప్రాంతం, పోలీసు స్టేషన్ పరిధి, ఫోన్ నంబరు నమోదు చేస్తే ఓటీపీ వస్తుందన్నారు. తద్వారా అనుమతులు లభిస్తాయన్నారు. మంటపాల వద్ద మైక్ తక్కువ సౌండ్ ఉండాలని, అశ్లీల నృత్యాలు, పాటలకు తావు ఇవ్వరాదన్నారు. నిమజ్జనం సమయంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సూర్యారావుపేట బీచ్‌లో లైటింగ్, బారికేడ్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం, పోలీసులు ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాల్లోనే విగ్రహాలు నిమజ్జనం చేయాలన్నారు. సమావేశంలో ఎస్సైలు మణికుమార్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

బోట్ల వేలం

కాకినాడ క్రైం: కాకినాడ పోర్టు పోలీస్ స్టేషన్‌లో సారా కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనం, బోట్లను మంగళవారం వేలం ప్రక్రియ ద్వారా విక్రయించారు. సెబ్ డీఎస్పీ ఏఎస్ దొర ఆధ్వర్యంలో పోర్టు సీఐ సునీల్‌కుమార్ సమక్షంలో ఈ వేలంపాట జరిగింది. ఈ వేలం ద్వారా సుమారు రూ.1.6 లక్షలు సమకూరిందని అధికారులు తెలిపారు.

దొంగ చేతికి తాళం ఇచ్చినట్టే..

- తాళం కప్ప కనిపించేలా వేయొద్దు
- కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ

కాకినాడ రూరల్: ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు తలుపులకు తాళంకప్ప కనిపించేలా వేస్తే.. దొంగ చేతికి తాళం ఇచ్చినట్టే అవుతుందని కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ అన్నారు. ఇంటి యజమానులు లేరని గమనించి చోరీలకు పాల్పడేందుకు దొంగలకు ఆవకాశం కలుగుతుందన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఇంద్రపాలెం పీఎస్ పరిధిలో కొవ్వాడ, తిమ్మాపురం పీఎస్ పరిధిలో దొంగతనాలు జరిగాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చోరీల నియంత్రణ కోసం ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు రాత్రి పూట గస్తీలు నిర్వహిస్తున్నామన్నారు. కాకినాడ సెమీ అర్బన్ ఏరియాలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ఇంటికి తాళంకప్ప బయటకు కనిపించే చోటే ఎక్కువగా చోరీలు జరిగినట్టు గుర్తించామన్నారు. ప్రధాన ద్వారం తాళం కనిపించకుండా, కనీసం కర్టెన్ అయినా వేయాలన్నారు. ఊరు వెళ్లేటప్పుడు బంగారు, వెండి వస్తువులు, నగదు ఇంట్లో ఉంచరాదన్నారు. బంధువుల ఇళ్ల వద్ద కానీ, లాకర్లలో కానీ భద్రపర్చుకోవాలన్నారు. కనీసం పోలీసు వారు కల్పించే లాకర్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలన్నారు. ప్రజలు ఇవేమీ పట్టించుకోకుండా, ఇంట్లో విలువైన వస్తువులు పెట్టి వెళుతున్నారన్నారు. ఇళ్ల వద్ద, కాలనీల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు బంగారు ఆభరణాలు వేసుకుని వెళ్లినప్పుడు చైన్ స్నాచర్ల ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో బీట్లు పెంచి, నిఘా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఇంద్రపాలెం, తిమ్మాపురం ఎస్సైలు మణికుమార్, రవీంద్రబాబు పాల్గొన్నారు.



తాళంకప్ప కనిపించేలా వేయవద్దని వివరిస్తున్న సీఐ చైతన్యకృష్ణ

గిడ్డంగుల సంస్థ పూర్వ ఉద్యోగుల ఔదార్యం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆపదలో ఉన్న తోటి ఉద్యోగికి సాయం అందించడంలో గిడ్డంగుల సంస్థ ఎప్పుడూ ముందుంటుందని సంస్థ ప్రతినిధి ఇందుగుల ప్రసాద్‌నాయుడు అన్నారు. గిడ్డంగుల సంస్థలో పనిచేస్తూ అకాల మరణం పొందిన నర్సింహమూర్తి కుటుంబానికి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విశ్రాంత ఉద్యోగులు రూ 75 వేల ఆర్థిక సాయం నర్సింహమూర్తి భార్యకు అందించామన్నారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ ప్రాంతీయ బేదాభిప్రాయాలను పక్కనపెట్టి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మూర్తి కుటుంబానికి ఆంధ్రా, తెలంగాణ ఉద్యోగులు సాయం చేయడం అభినందనీయమని చెప్పారు. ఉద్యోగులు ఇచ్చిన మొత్తాన్ని కాకినాడ జగన్నాథపురం అన్నమ్మఘాట్ వద్ద ఉంటున్న నర్సింహమూర్తి భార్యకు మంగళవారం అందించినట్టు తెలిపారు.



నర్సింహమూర్తి భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న నాయుడు

ఈ కార్యక్రమంలో బసవ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలి

బోట్‌క్లబ్: సాగర తీరంలో పెద్దఎత్తున సామూహిక నిమజ్జనాలు జరుగుతున్నందున అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని నగర గణేశ్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు అన్నారు. సమితి 35వ వార్షిక జిల్లా సమావేశం పైండా శ్రీనివాస కల్యాణ మండపంలో మంగళవారం జరిగింది. తొలుత గణేశ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. చవితి ఉత్సవాలు వేడుకలా జరగాలని సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పైడా భవనప్రసాద్ అన్నారు. సభ్యులు పైడా వేంకటనారాయణ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా ఉత్సవాలు జరగడం సంప్రదాయానికి ప్రతీకగా ఉదహరించారు. సంస్కార భారతి జిల్లా కార్యదర్శి సరిపెళ్ల శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ గణేశ తత్వం పర్యావరణహిత లోక కల్యాణమని వివరించారు. సమితి నిర్వహణకు మార్గదర్శిగా నిలిచిన పైడా భవనప్రసాద్‌ను గణపతి పూలమాలతో సత్కరించారు. సమితి సభ్యులు రంభాల వేంకటేశ్వరరావు, మాలకొండయ్య పాల్గొన్నారు.



గణపతి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న సమితి సభ్యులు

జీఓలు సత్వరం విడుదల చేయాలి

- పీహెచ్‌సీల వద్ద ఆశా వర్కర్ల ధర్నా

పెద్దాపురం: ఆశా వర్కర్లకు ఇచ్చిన మినిట్స్ ప్రకారం సత్వరమే జీఓలు విడుదల చేయాలని కోరుతూ మంగవారం పెద్దాపురం అర్బన్, రూరల్ పీహెచ్‌సీల వద్ద ఆశా వర్కర్లు ధర్నాలు నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరయు సీఐటీయూ ఆధ్వర్యంలో పులిమేరు, కాండ్రకోట, పెద్దాపురం పీహెచ్‌సీల్లో సంఘ నాయకులు ఈశ్వరి, దాడి బేబీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీల వద్ద ధర్నా నిర్వహించి, వైద్యులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం ప్రకారం, జీఓలు, సర్క్యులర్లు విడుదల చేయాలన్నారు. ప్రస్తుత నిత్యావసర ధరలకనుగుణంగా ఆశా వర్కర్లకు రూ.26 వేల వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వంద రోజుల్లో ఇళ్లను నిర్మించాలి

- హౌసింగ్ పీడీ సత్యనారాయణ

సామర్లకోట: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వంద రోజుల్లో పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ ఎస్‌వీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లను వేగంగా పూర్తి చేసి, పునాదిలో, శ్లాబ్ లెవెల్‌లో, పూర్తయిన ఇళ్లను గుర్తించి ఫొటోలతో అప్‌లోడ్ చేసి, బిల్లులు పెట్టాలని సూచించారు. తద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లించాల్సిన మొత్తం గుర్తించడానికి వీలుంటుందని చెప్పారు. అదే విధంగా 2016 నుంచి 2019 వరకు నిర్మించిన ఎన్టీఆర్ ఇళ్లకు సంబంధించి వివరాలను ఈ నెల 10వ తేదీ నాటికి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికి ఇచ్చిన టార్గెట్‌ను సకాలంలో పూర్తి చేయకపోతే కలెక్టర్ చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. బుధవారం జరిగే జెడ్పీ సమావేశంలో ఎన్టీఆర్ ఇళ్లకు చెందిన బిల్లుల బకాయిలపై ప్రజాప్రతినిధులు ప్రశ్నించే అవకాశం ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకుని లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సామర్లకోట మండలం హౌసింగ్ సర్వేలో వెనుకబడి ఉందని హౌసింగ్ ఈఈ వై శ్రీనివాసరావు అన్నారు. ఇళ్ల లబ్ధిదారులకు మహిళా సంఘాల రుణాలు ఇప్పించడం ద్వారా ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డులు ఉన్న వారందరికీ పని కల్పించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

ఇసుక సమస్యను పరిష్కరించండి

పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక సమస్య ఎక్కువగా ఉందని, దానిని పరిష్కరించడానికి కృషి చేయాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో దళారులు ఇసుకను తీసుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని అసంపూర్తిగా ఉన్న ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకు ఇసుక ఇచ్చే ఏర్పాట్లు చేయాలని, ఈ మేరకు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. మండలంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి బకాయిలను గుర్తించాలన్నారు. మండలంలో హౌసింగ్ కాలనీలకు సంబంధించి చేసిన పనులకు కాంట్రాక్టర్లకు రూ.4.80 కోట్ల బకాయిలు రావలసి ఉందని, ఆ మొత్తం చెల్లించేలా చూడాలన్నారు. హౌసింగ్ శాఖ వద్ద రికార్డు ఉందని, చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని పీడీ సత్యనారాయణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి శ్రీలలిత, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకరరావు, ఏఈ మొహమ్మద్ ముస్తాక్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

కష్టకారం

- మిరప పంటకు ముంపు బెడద
- నేలకొరిగిన మొక్కలు
- తెగుళ్లు సోకే అవకాశం
- జాగ్రత్తలు పాటించాలంటున్న ఉద్యాన శాఖ అధికారులు



గొల్లప్రోలు మండలంలో ముంపులో ఉన్న బంతి తోట



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో నీట మునిగిన మిరప పంట

పిఠాపురం: ఎండావాన ఒకదాని తరువాత ఒకటి వస్తుంటే ఉద్యాన పంటలకు నష్టం కలిగే అవకాశాలుంటాయి. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో మిరప పంటలు అధికంగా సాగవుతున్నాయి. ప్రస్తుత వర్షాలతో మిరప పంటలు ముంపు బారిన పడ్డాయి. వర్షాలకు మొక్కలు నేలకొరగ్గా, నష్టాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా పంటలను సంరక్షించుకుని, నష్టాలను నివారించవచ్చంటున్నారు ఉద్యాన అధికారులు. ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు వారు పలు సూచనలు చేస్తున్నారు.

వర్షాల వల్ల మిరపకు నష్టం

అధిక వార్షాల వలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడి, పంట ముంపు బారిన పడే అవకాశాలున్నాయి. తద్వారా అధిక తేమ వల్ల వేర్ల ద్వారా మొక్కకు అవసరమైన పోషకాలను తీసుకోలేదు. దీంతో పంటను పురుగులు, తెగుళ్లు ఆశించడమే కాకుండా, సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువ కనిపిస్తాయి. పంట దశ ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రత్తలు తీసుకుంటే పంటను రక్షించుకోవడంతో పాటు, నష్టాలను నివారించుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేయాలి. వాలిన మొక్కలను నిలబెట్టి, మొదలులో మట్టిని వేసి బలంగా ఉండేలా చూడాలి. నేల వాలిన మొక్కలు వెంటనే తేరుకోవడానికి లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పైపాటుగా అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ , 200 కిలోల వేప పిండి వేయాలి. నేల అదనుకు వచ్చిన వెంటనే గొర్రుతో అంతర కృషి చేయాలి. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములను లీటరు నీటికి, సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి ఒకదాని తరువాత ఒకటి, వారం రోజుల వ్యవధిలో 2–3 సార్లు పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా, ఆకుమచ్చ, కానోఫరా వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక గ్రాము, స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా వాటి వ్యాప్తిని అరికట్టవచ్చు. మిరప పంట పూర్తిగా ముంపునకు గురై, పూర్తిగా నష్టం వాటిల్లితే పంటను తీసివేసి, ప్రత్యామ్నాయంగా మరో పంటను సాగు చేసుకోవాలి.

నియోజకవర్గంలో దెబ్బతిన్న పంటలు (ప్రాథమిక అంచనా)

మిరప	71 హెక్టార్లు
బంతి	4 హెక్టార్లు



మిరప రైతులకు సూచనలు ఇస్తున్న పిఠాపురం ఉద్యాన శాఖాధికారి సత్య శైలజ

చిన్నపాటి జాగ్రత్తలతో..

నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో వాణిజ్య పంటలను పరిశీలించాం. రైతు సేవా కేంద్ర సిబ్బందిని అప్రమత్తం చేశాం. రైతులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు అందించేలా ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం వరదల వల్ల దెబ్బతిన్న పంటలను అంచనాలు వేస్తున్నాం. ప్రాథమిక అంచనాల ప్రకారం, మిరప 71 హెక్టార్లు, బంతి 4 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తమ పంటలను వర్షాల నుంచి రక్షించుకోడానికిచ చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా నస్టాలను నివారించుకోవచ్చు. పంటలలో ఎటువంటి తేడాలు గమనించినా వెంటనే రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలియజేయాలి. వాటిని పరిశీలించి తగిన జాగ్రత్తలు తెలియజేస్తాం. ప్రస్తుతం వరదల వల్ల మిరప, బంతి పంటలు దెబ్బతినే పరిస్థితులు ఉన్నందున అధికారుల సూచనలను రైతులు పాటించడం ద్వారా పంట నష్టం వాటిల్లకుండా చేసుకోవచ్చు. కాయగూరల రైతులు పంట కోత పూర్తి చేసుకోవాలి. అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలి. తగిన ఎరువులు వేయాలి. బంతి పంటకు సంబంధించి వీలున్నంతలో పంట కోత చేసుకోవడం మేలు.

– కె సత్య శైలజ, ఉద్యాన శాఖాధికారి, పిఠాపురం

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. మంగళవారం నిందితులను కోర్టులో హాజరుపర్చగా, ముగ్గురికి రెండు రోజుల వంతున జైలు, పది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై మౌనిక అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామ హైస్కూల్‌లో మంగళవారం పాఠశాల విద్యార్థులకు ఆత్మరక్షణ–కర్తవ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సర్పంచ్ కొత్త చక్రరావు అధ్యక్షత వహించారు. ఎస్సై మౌనిక మాట్లాడుతూ, విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, సామాజిక అంశాలపై మక్కువను పెంచుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న సంఘటనలపై అవగాహన పెంచుకుని, విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థి చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.